లోటు వర్షపాతం - ప్రత్యామ్నాయ పంటల సాగు తప్పనిసరి




www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

జిల్లాలో నేర నియంత్రణకు పటిష్ట చర్యలు




హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 193, శనివారం 15-8-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

# ప్రశ్నపత్రాల లీకేజీలు నిర్మూలిస్తాం



**- విద్యార్థులే భావి భారత నిర్మాతలు.. స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో ముర్ము**

**- రాష్ట్రపతి ప్రసంగానికి ముందు, తర్వాత 'వందేమాతరం' ఆలాపన**

**న్యూఢిల్లీ, ఆగస్టు14(భద్రాద్రి న్యూస్):** విద్యార్థులే భావి భారత నిర్మాతలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలు లేకుండా పబ్లిక్ పరీక్షలను నిర్వహించేందుకు, పరీక్షల వ్యవస్థను మరింత విశ్వసనీయంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సంస్కరణలు చేపడుతోందని తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి శుక్రవారం ప్రసంగించారు. మహాత్మా గాంధీ, సర్దార్‌పటేల్, అంబేడ్కర్ తదితర స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి, విద్యార్థులు, దేశ భవిష్యత్తు, మహిళా సాధికారిత, సాంకేతిక పురోగతి, జాతీయ భద్రత, వికసిత్ భారత్ తదితర అంశాలపై ఆమె మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల నిర్వహణలో అవకతవకలు లేకుండా చేసేందుకు, పరీక్షల వ్యవస్థలో విశ్వసనీయతను పెంచేందుకు ప్రభుత్వ సంస్కరణలు చేపట్టిందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలపై దేశవ్యాప్తంగా జెన్‌జీ ఇటీవల చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యువత వల్ల దేశంలో బలమైన స్టార్టప్ వ్యవస్థ ఏర్పాటైందని, భారత యువశక్తిని చూసి అంతర్జాతీయ సంస్థలు ఆశ్చర్యపోతున్నాయని తెలిపారు. ఉగ్రవాదంపై పోరు అంశంలో ఆపరేషన్ సిందూర్ భారత శక్తి, సామర్థ్యాలను ప్రపంచానికి చాటిందని, ఉగ్రవాదులకు, ఉగ్రవాదానికి మద్దతిచ్చే వారికి బలమైన హెచ్చరికలు పంపిందని చెప్పారు. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పిస్తున్న దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం జాతీయ, రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం తీసుకున్న అత్యంత వ్యూహాత్మక చర్య అని రాష్ట్రపతి అభివర్ణించారు. నకల్సిజం నిర్మూలన అనేది దేశం సాధించిన గొప్ప విజయమని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా యుద్ధ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రపంచ సగటు వృద్ధి రేటుకు రెట్టింపు వేగంతో భారత ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తోందని, దశాబ్ద కాలంలో 22 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని చెప్పారు. స్వాతంత్ర్య భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా నిలబెట్టేందుకు ప్రతీ పౌరుడి భాగస్వామ్యం అవసరమని రాష్ట్రపతి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు రాసిన ' దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అనే సందేశాన్ని ప్రస్తావించారు. అలాగే, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలపై మాట్లాడుతుండగా పండిత్ రఘునాథ్ ముర్ము సంతాళి భాషలో రాసిన ' ఏక్ పేడ్ మా కీ నామ్' అనే కవితను ప్రస్తావించారు. కాగా, రాష్ట్రపతి ప్రసంగానికి ముందు, తర్వాత వందేమాతం గేయాన్ని తొలిసారి పూర్తిగా ఆలపించారు. ఇక, రాష్ట్రపతి ప్రసంగం స్ఫూర్తిదాయకమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించేలారాష్ట్రపతి సందేశం ఉందన్నారు.



# నేతాజీ యువజన సంఘం సేవలు ఆదర్శనీయం

- డాక్టర్ సోమరాజు దొర
- ఘనంగా నేతాజీ యువజన సంఘం 34వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- ఎస్.జె.కె.అహ్మద్‌ను ఘనంగా సన్మానించిన నాయకులు
- సంఘం కార్యాలయంలో సందడి

**పాల్వంచ ,ఆగస్టు 14 (భద్రాద్రిన్యూస్) :** నేతాజీ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను యువత ఆదర్శంగా తీసుకొని సమాజ సేవకు పాటుపడాలని పాల్వంచ ప్రముఖ వైద్యులు డాక్టర్ సోమరాజు దొర పిలుపునిచ్చారు. శుక్రవారం పాల్వంచ పట్టణ పరిధిలోని వనమా కాలనీలోని నేతాజీ యువజన సంఘం కార్యాలయంలో 34వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సోమరాజు దొర హాజరై సంఘం సభ్యులతో కలిసి నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించి, కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్.జె.కె.అహ్మద్ ను నాయకులు, సంఘం సభ్యులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.
అనంతరం డాక్టర్ సోమరాజు దొర మాట్లాడుతూ.. నేతాజీ యువజన సంఘాన్ని స్థాపించి 33 ఏళ్లుగా నిరుపేదలు, బాధితులు, నిస్సహాయులకు అండగా ఎస్.జె.కె. అహ్మద్ అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ముఖ్యంగా కరోనా విపత్కర సమయంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో పేదలు, నిరాశ్రయులకు అందించిన సేవలు అభినందనీయమన్నారు.
"మానవ సేవే మాధవ సేవ" అనే నినాదంతో ఎటువంటి స్వార్థం లేకుండా నిరుపేదలు, బాధితులు, పీడితులు, నిస్సహాయులకు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు.
నేతాజీ యువజన సంఘంతో తనకు ఎంతోకాలంగా అనుబంధం ఉందని డాక్టర్ సోమరాజు దొర తెలిపారు. సంఘం నిర్వహించే ప్రతి సేవా కార్యక్రమంలోనూ భాగస్వామ్యం కావడం తనకు ఎంతో సంతోషంగా ఉంటుందని, తాను కూడా నేతాజీ యువజన సంఘం కుటుంబ సభ్యుడినేనని అన్నారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలకు తనను ఆహ్వానిస్తూ సమాజ సేవలో భాగస్వామిని చేస్తున్న అధ్యక్షుడు ఎస్.జె.కె. అహ్మద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ కాల్వ దేవదాసు, సీనియర్ వైద్యులు డాక్టర్ నామ బుచ్చయ్య, పాల్వంచ కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి వేముల కొండలరావు, జనతా ఫౌండేషన్ జాయింట్



సెక్రటరీ సయ్యద్ అక్బర్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుడగం నాగేశ్వరరావు, సమగ్ర అభివృద్ధి వేదిక అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్, టీ.యు.ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మంజూర్, జమే మజీద్ కమిటీ జాయింట్ సెక్రటరీ ఎస్.కె.అక్బర్, జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దర్ భాష, టీ.వి.పి.ఎస్ పాల్వంచ మండల అధ్యక్షుడు ఎస్.ఏ.నయీమ్, రిటైర్డ్ సిఐ జారే బిక్షం,స్థానికులు చిమ్మి నాయుడు, సక్రు, బాబర్, ఓం ప్రకాష్, అచ్చయ్య నాయక్, లక్ష్మీ నాయుడు, సయ్యద్ నూర్జహాన్ పర్వీన్, టి.వరలక్ష్మి, టి.రాణి, కె.జీవమ్మ, మదీనా, సక్కుబాయి, భానుమతి, సృజన, తదితరులు పాల్గొన్నారు.

# కవాసి లఖ్మాకు విజయవంతమైన క్యాటరాక్ట్ శస్త్రచికిత్స




**పాల్వంచ, ఆగస్టు 14 (భద్రాద్రిన్యూస్ ):** కొంటా నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఛత్తీస్‌గఢ్ మాజీ మంత్రి కవాసి లఖ్మాకు పాల్వంచలోని నవభారత్ ఐ సెంటర్ (LVPEI)లో కుడి కంటికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఆగస్టు 13న డా. కొలిపాక గౌరీ ప్రతిన్య ఆధ్వర్యంలో



శస్త్రచికిత్స పూర్తికాగా, అనంతరం ఆయనను ఆగస్టు 14న ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. కేంద్రంలో అందించిన వైద్య సేవలు, రోగి సంరక్షణ పట్ల లఖ్మా సంతృప్తి వ్యక్తం చేసి వైద్యులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని కేంద్రం అడ్మినిస్ట్రేటర్ శ్రీ దేవిచందర్ రావు తెలిపారు.

# లోటు వర్షపాతం - ప్రత్యామ్నాయ పంటల సాగు తప్పనిసరి



**జూలూరుపాడు(భద్రాద్రి న్యూస్):** ఈ వానాకాలం 2026 లో వర్షపాతం సాధారణ వర్షపాతం కన్నా తక్కువే నమోదు అయ్యింది. ఎల్ నినో ప్రభావం స్పష్టం. వానాకాలం నాలుగు నెలల్లో రెండున్నర నెలల కాలం పూర్తివుతుంది. మిగిలిన నెలన్నర కాలంలో, పంటలు వేసే తరుణం ముగిసిపోయింది.ముఖ్యంగా వరి సాగు ఏవిధంగాను వీలుకాదు. వర్షాభావానికి తోడు, భూగర్భ జలాలు లోనికి పోతున్నాయి.బోరు సౌకర్యం వున్న రైతులు కూడా వరి నాట్లు వేయవద్దని వ్యవసాయ శాఖ సూచిస్తుంది. సెప్టెంబర్ నెలలోకూడా వర్షాభావ పరిస్థితులే అని వాతావరణ శాఖ అంచనా. కరెంటు ఉత్పత్తి సరిపడా ఉండే సూచనలు లేవు. ఈ నేపథ్యంలో, రైతులు తప్పనిసరిగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టడం అనివార్యం. వ్యవసాయ శాఖ కూడా తదనుగుణంగా రైతులకు అవగాహన కల్పిస్తుంది.తక్కువ నీటి అవసరం ఉండే అపరాల పంటలైన మినుము, పెసర, కంది, నూనె గింజల పంటలైన నువ్వులు, వేరుశనగ, సన్ ఫ్లవర్, చిరు ధాన్యపు పంటలైన జొన్న, మొక్కజొన్న, రాగి, సజ్జ సాగు చేయటం మేలు.అశ్వారావుపేట వ్యవసాయ డివిజన్ లో ఇప్పటి వరకు ఈ వానాకాలంలో వివిధ పంటల సాగు విస్తీర్ణం గత వానాకాలం తో పోలిస్తే ఆసక్తికరంగా వుంది. ముఖ్యంగా వరి సాగు 31,446ఎకరాలకు పరిమితమయ్యింది. గత సంవత్సరం వరి 40,206 ఎకరాల్లో సాగయ్యింది అంటే 8వేల ఎకరాలకు పైగా విస్తీర్ణం తగ్గింది. వరి తర్వాత రెండవ ప్రధాన పంట పత్తి. పత్తి సాగు సరాసరి గత సంవత్సరం విస్తీర్ణం 33,360ఎకరాలతో సమానంగా సాగు చేసారు.వరి సాగు కాని తొమ్మిది వేల ఎకరాల్లో వివిధ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే దిశలో రైతులకు సూచిస్తున్నట్లు ఏడిఏ పెంటేల రవి కుమార్ తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలుగా మినుము, పెసర, అలచంద, మొక్కజొన్న, జొన్న సాగు చేయాలనీ రైతులకు విజ్ఞప్తి చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. అయితే, సాగు నీటి వసతి మరియు రైతు ప్రాధాన్యం అనుసరించి ఒక్కో మండలంలో ఒక పంటకు ప్రాముఖ్యత వుంది. అశ్వారావుపేట లో మినుము, చంద్రుగొండ లో మిరప, దమ్మపేట లో వేరుశెనగ,మొక్కజొన్న, ఆయిల్ పామ్, ములకలపల్లి లో వేరుశనగ,



మొక్కజొన్న,యూకాలిప్టస్ రైతుల ప్రాధాన్యంలో ఉన్నాయి. వేరుశనగ సాగుకు ఈ నెల చివరి నుండి మొదలవుతుంది. మినుము సాగు ఇప్పటికే దుక్కిచేసి విత్తనాలు వేసే పనిలో రైతులు వున్నారు. ఆత్మనిర్భరత మిషన్ పథకం లో యాభై శాతం రాయితీపై మినుము విత్తనాలను వ్యవసాయ శాఖ అందిస్తుంది. అలాగే నీటి సౌకర్యం కలిగిన రైతులను ఆయిల్ పామ్ సాగు చేసే విధంగా ప్రోత్సాహిస్తున్నారు.డివిజన్ లో ఆయిల్ పామ్ మొక్కలు వేయటం, డ్రిప్ సౌకర్యం ఏర్పాటు, మిరప నాట్లు వేయటం, వేరుశెనగ విత్తే ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నాయి.
వానాకాలం - 2026లో ఆగష్టు 13నాటికి నమోదైన వర్షపాతం (మండలాల వారీగా):
అన్నపురెడ్డిపల్లి: సాధారణం 582.5మి.మీ., నమోదు 386.7మి.మీ. 33శాతం లోటు
అశ్వారావుపేట: సాధారణం 555.9 మి.మీ., నమోదు 281.2మి.మీ. 49.4 శాతం లోటు
చంద్రుగొండ: సాధారణం 553.8మి.మీ., నమోదు 631.6మి.మీ. 14శాతం అధికం
దమ్మపేట: సాధారణం 616.8 మి.మీ., నమోదు 243.6 మి.మీ. 60.5 శాతం అధిక లోటు
ములకలపల్లి: సాధారణం 662.4మి.మీ., నమోదు 384.2మి.మీ. 42శాతం లోటు



మొత్తం అశ్వారావుపేట వ్యవసాయ డివిజన్‌లో ఆగష్టు 13 నాటికి సాధారణంగా కురవాల్సిన 594.2మి.మీ. వర్షపాతానికి గాను 385.4మి.మీ. మాత్రమే నమోదైంది. దీంతో డివిజన్‌లో 35శాతం వర్షపాతం లోటు నమోదైనది. : కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ వ్యవసాయ రంగంలో స్థిరత్వాన్ని సాధించేందుకు సమగ్ర వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కరువు పరిస్థితుల్లో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా తీర్చిదిద్దేందుకు నేల ఆరోగ్యం మెరుగుదల, నేల తేమ సంరక్షణ, పంటల వైవిధ్యీకరణ, నీటి వినియోగ సామర్థ్యం పెంపు, సమగ్ర వ్యవసాయ విధానాల అమలుకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులను కోరారు. వ్యవసాయాన్ని కేవలం పంటల సాగుకే పరిమితం చేయకుండా ఉద్యానవనాలు, పశుసంవర్ధక, మత్స్య, అటవీ ఆధారిత జీవనోపాధులు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేసి రైతులు, గ్రామీణ కుటుంబాల ఆదాయాన్ని స్థిరీకరించేదిశలో రైతులు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు.

# ముత్తూట్ సంస్థ వారి ఆధ్వర్యం లో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ డ్రాయింగ్ పోటీల్లో శ్రీ రాగా విద్యార్థుల ప్రతిభ



**కొత్తగూడెం అర్బన్ ,ఆగస్ట్ 14 (భద్రాద్రిన్యూస్) :** మెదరబస్తి 53వ డివిజన్‌లోని శ్రీ రాగా ప్లే ఢ హై స్కూల్ విద్యార్థులు ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి నగదు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు సాధించారు.
ప్రథమ బహుమతి: ఎస్. కె జునైద్ -- 6వ తరగతి,
ద్వితీయ బహుమతి: రేశ్వంత్ -- 10వ తరగతి
తృతీయ బహుమతి: హాసిని -- 7వ తరగతి విజేతలకు ఒక్కొక్కరికి రూ.500 నగదు బహుమతితో పాటు మెడల్,



సర్టిఫికెట్ అందజేశారు. కరస్పాండెంట్ మల్లారపు వర ప్రసాద్, డైరెక్టర్ కవిత విజేతలను అభినందించారు. ముత్తూట్ సంస్థ ప్రతినిధులు రాకేష్ యాదవ్, సాయిరామ్ తదితరులు బహుమతులు అందజేశారు.విద్యార్థుల్లో సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని కరస్పాండెంట్ తెలిపారు. విజేతలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు రాంబాబు,మహాలక్ష్మి, చరిత శ్రీ , ముత్తూట్ సంస్థ సిబ్బంది కార్తీక్,ప్రియాంకా రెడ్డి,కోమల ,సంగీత తదితరులు పాల్గొని అభినందించారు.

# కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద సింగరేణి మారుపేర్ల బాధితులు ఆమరణ నిరాహార దీక్ష

**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 14 (భద్రాద్రి న్యూస్) :** సింగరేణి మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితుల ఆందోళన మరింత ఉధృతమైంది. సమస్యలను పరిష్కరించాలంటూ గత వారం రోజులుగా కొత్తగూడెంలోని సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట నిరసన దీక్ష కొనసాగిస్తున్న బాధితులు. యాజమాన్యం, ప్రభుత్వం నుంచి స్పష్టమైన స్పందన లేకపోవడంతో శుక్రవారం నుంచి ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. సింగరేణి మారుపేర్లు, విజిలెన్స్ బాధితుల సంఘం అధ్యక్షుడు లక్కా శ్రావణ్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ దీక్ష ప్రారంభమైంది. బాధితులు దానాడ రాజు, ఓం ప్రకాష్, కొల్లిపాక అన్వేష్, గుర్రం సుధాకర్, దిశబాబు, రెక్కు శ్రావణ్, రేపాక కలావతి, భాగ్యలక్ష్మి తదితరులు దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. తమ కుటుంబాలు ఎన్నో సంవత్సరాలుగా అన్యాయానికి గురవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించి బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభమైన నేపథ్యంలో పోలీసులు పెద్ద సంఖ్యలో దీక్షా శిబిరానికి చేరుకుని భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కార్మిక సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, బాధిత కుటుంబ సభ్యులు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఐఎన్‌టీయూసీ నాయకులు సైతం



బాధితులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా లక్కా శ్రావణ్ గౌడ్ మాట్లాడుతూ.. "మా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ఆమరణ నిరాహార దీక్షను విరమించం. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి" అని అన్నారు. తమ న్యాయపోరాటానికి అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజలు మద్దతు తెలిపి భాగస్వాములు కావాలని భాదితులు విజ్ఞప్తి చేసారు.

# 80వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని 1200 వందల మీటర్ల జాతీయ జండా ప్రదర్శన...

**జూలూరుపాడు(భద్రాద్రి న్యూస్):** జూలూరుపాడు మండల కేంద్రంలో ఆరోగ్య జీవన యాత్ర(వకర్స్) ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా 1200 వందల మీటర్ల పొడవైన జాతీయ జండాతో భారీ ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు, మండల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని స్వాతంత్ర స వ ం ర య ా ధ ు ల న ు స్మరించుకుంటూ మువ్వన్నెల జండాలతో దేశభక్తిని చాటుకున్నారు అదేవిధంగా కిషన్ మోర్చా ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం పట్ల అందరూ ప్రేమతో జెండా పండగ నిర్వహించడం చాలా సంతోషమని కులమతాలకు అతీతంగా త్రివర్ణ పతాకాలు చేత పట్టుకొని స్వాతంత్రం పోరాటం చేసిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ జాతీయ జెండాలతో ప్రదర్శన చేయటం దేశం పట్ల ఐక్యతకు నిదర్శనం అని కొనియాడారు..





# జిల్లాలో నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు ఎస్పీ రోహిత్ రాజు

**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 14 (భద్రాద్రి న్యూస్) :** జిల్లాలో నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ కార్యాలయం నుంచి వర్చువల్గా నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించి జిల్లాలో నేర పరిస్థితులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిపై సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తులో జాప్యం, నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, బాధ్యతారహితంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, భరోసా కేంద్రం, షీ-టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి హాట్‌స్పాట్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని, ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి బాధితులకు అండగా నిలవాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్ 2.0లో పెండింగ్ వివరాలను సకాలంలో నమోదు చేయడంతో పాటు నాట్రిడ్ వినియోగాన్ని పెంచాలని సూచించారు. రౌడీషీట్లు, మిస్సింగ్ కేసులు, పోక్సో, ఎస్సీ, ఎస్టీ, మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సీసీటీవీ నెట్వర్కు బలోపేతం చేసి కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. డయల్-100కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు సహాయం అందించాలని, పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్పై




నిరంతరం తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్తో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# MRPS నూతన కమిటీ ఎన్నిక



**గుండాల14 భద్రాద్రి న్యూస్:** మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మండలంలోని కాచనపల్లి గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఎం ఆర్ పి ఎస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా య నగంటి. దయాకర్ బాబు, అధికార ప్రతినిధిగా య నగంటి. ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి య నగంటి రమేష్, కార్యదర్శి గా యనగంటి. చిన్న నాయుడు సభ్యులుగా మెంతెన వరుణ్ కుమార్, య నగంటి కార్తీక్,య నగంటి ప్రభుదాస్, య నగంటి బికారయ్య, కాంపాటి ఎల్లయ్య, మెం తెన యాకూబ్ ఎన్నిక కాగా నూతన కమిటీని ఉద్దేశించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఈసంపల్లి కృష్ణ గుండాల మండల అధ్యక్ష కార్యదర్శులు బొమ్మెరనాగేష్ బొమ్మెర సత్యం మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో ఏ బి సి డి వర్గీకరణ సాధించుకున్నాము సాధించుకున్న వర్గీకరణ పలాలు ప్రతి మాదిగ కుటుంబానికి చేరాలని చేరే విధంగా నూతన కమిటీ కృషి చేయాలని జాతి మను గడును కాపాడుకోవాలని జాతి హక్కుల కోసం జరిగే పోరాటాలలో ముందు భాగాన మన బిడ్డలు నిలిచే విధంగా మన పోరాటాలు మన నాయకత్వం ఉండాలని వారికి సూచించారు ఈ కార్యక్రమంలో య నగంటి రామ్మూర్తి,య నగంటి సంపత్,మంతెన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా యాత్ర




**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 14 (భద్రాద్రి న్యూస్) :** బీజేపీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో రామవరం సెంటర్‌లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ జాతీయ జెండాలను అందిస్తూ, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, దేశభక్తులు మరియు భారత పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రదర్శించిన దేశభక్తి, జాతీయ జెండాపై ఉన్న గౌరవం, దేశం పట్ల ఉన్న అభిమానాన్ని చాటిచెప్పారు. దేశం కోసం, జాతీయ సమైక్యత కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని బీజేపీ పట్టణ కమిటీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ఆదిముల రాములు, నోముల రమేష్, కొత్తూరు శ్రీనివాస్, వ్యాపార యజమాని గిర్ధ లాల్ మరియు రామవరం ప్రజలు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న కాంగ్రెస్ సీనియర్ నేతకు నాయకుల అండ

**- మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లును పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు.. ఆర్థికంగా సహాయం చేస్తామని భరోసా**



**సింగరేణి మండలం, ఆగస్టు 14 (భద్రాద్రి న్యూస్ రాములు):** ఉసిరికాయలపల్లి మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు కిడ్నీ ఆపరేషన్లు చేయించుకుని ప్రస్తుతం స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉసిరికాయలపల్లిలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా గడ్డం వెంకటేశ్వర్లును ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా సేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆయన ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో తమ వంతుగా ఆర్థిక సహాయం అందించి అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా గడ్డం వెంకటేశ్వర్లు అందించిన సేవలను నాయకులు గుర్తుచేసుకున్నారు. అనారోగ్య సమయంలో ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని తెలిపారు. పరామర్శించిన వారిలో గిద్దవారిగూడెం సర్పంచ్ ఈసాల వెంకటేశ్వర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనంతరామయ్య, మాజీ సర్పంచ్ బద్రు నాయక్, సట్టు వీరభద్రం, ఆవుల వెంకటేశ్వర్లు, గమిడి నరసింహారావు, గుగులోతు వీరన్న, పులి భూక్యా బన్సీలాల్, వినాయక రాందాస్, లక్ష్మణ్ ఉన్నారు.

## సోలార్ విద్యుత్ లోను సింగరేణి సంస్థ విజయపథం



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 14 (భద్రాద్రి న్యూస్) :** సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా విద్యుత్, సోలార్ తదితర రంగాల్లో విజయపథంలో దూసుకెళ్తుంది థర్మల్ విద్యుత్ రంగంలో ఇప్పటికే సత్తా చాటిన సంస్థ, సోలార్ విద్యుత్ ఉత్పత్తిలోనూ ముందంజలో నిలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ ప్రధాన కార్యాలయంపై ఏర్పాటు చేసిన 1.23 మెగావాట్ల ఆన్గ్రిడ్ రూఫ్ పీవీ సోలార్ పవర్ ప్లాంటును సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ఇప్పటివరకు 245 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, విద్యుత్తును ఉత్పత్తి చేస్తోందని తెలిపారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలకు అనుగుణంగా మరిన్ని సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సింగరేణి అధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. సంస్థకు అందుబాటులో ఉన్న ఖాళీ ప్రదేశాలతో పాటు భవనాల పైకప్పులను సద్వినియోగం చేసుకుంటూ పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని మరింత విస్తరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి సంస్థగా ప్రారంభమైన సింగరేణి.. థర్మల్, సోలార్ విద్యుత్ రంగాల్లోకి విస్తరిస్తూ భవిష్యత్ ఇంధన అవసరాలకు అనుగుణంగా కార్యకలాపాలను విస్తరిస్తోందన్నారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, గౌతం పొట్రూ, తిరుమలరావు, జీఎంలు మనోహర్, రామ్మోహన్, కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వరలక్ష్మీ వ్రతంలో మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి

**రైతులకు సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 14 (భద్రాద్రి న్యూస్) :** శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా వైరా వేదపాఠశాలలో శ్రీ సత్యసాయి సేవా ట్రస్టు మహిళా విభాగం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డా. బానోత్ చంద్రావతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులతో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ గోపూజతో పాటు 108 బిందెల నీటితో ప్రత్యేక జలాభిషేకం నిర్వహించారు. రైతుల సంక్షేమం, ప్రజల సుఖసంతోషాల కోసం భగవంతుడిని ప్రార్థించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా ట్రస్టు రాష్ట్ర అధ్యక్షులు దమ్మాలపాటి సుధాకర్, జిల్లా అధ్యక్షులు నరసింహారావు, వైరా కన్వీనర్ కుమార్, కోఆర్డినేటర్ భాస్కర్‌రావు, యూత్ కోఆర్డినేటర్ నరేష్, మహిళా కోఆర్డినేటర్ హనుమాయమ్మ, కాపా మురళీకృష్ణ, 15వ వార్డు కౌన్సిలర్ శైలజ, మాచెర్ల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.





## ఎర్రజెండా ఉద్యమానికి పుల్లమ్మ సేవలు మరువలేనివి

**- సీపీఎం బలమైన సానుభూతిపరురాలు మాచర్ల పుల్లమ్మ మృతి..**
**- మృతదేహానికి పార్టీ నాయకుల నివాళులు**

**కారేపల్లి, ఆగస్టు 14 (భద్రాద్రి న్యూస్ రాములు):** అణగారిన వర్గాల హక్కుల కోసం, పేదల సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా ఉద్యమానికి అండగా నిలిచిన సీపీఎం బలమైన సానుభూతిపరురాలు మాచర్ల పుల్లమ్మ మృతి బాధాకరమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం చీమలపాడు గ్రామంలో వృద్ధాప్య సమస్యలతో మృతి చెందిన మాచర్ల పుల్లమ్మ మృతదేహంపై పార్టీ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెరుగు సత్యనారాయణ మాట్లాడుతూ.. చీమలపాడు ప్రాంతంలో అణగారిన వర్గాల హక్కులు, కూలీలు, పోడు రైతుల సమస్యలపై జరిగిన అనేక పోరాటాల్లో పుల్లమ్మ తన వంతు సహకారం అందించారని కొనియాడారు. పార్టీకి, ఉద్యమానికి ఆమె అందించిన సేవలు మరువలేనివని అన్నారు. తన కుటుంబాన్ని కూడా పార్టీ భావజాలం వైపు నడిపించడంలో పుల్లమ్మ చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. పుల్లమ్మ జీవితం నేటి తరానికి ఆదర్శమని, మహిళలు, యువతీ యువకులు ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యలపై పోరాడాలని, ఎర్రజెండా బాటలో నడవాలని పిలుపునిచ్చారు. మాచర్ల పుల్లమ్మ మృతికి సీపీఎం నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం సింగరేణి మండల కార్యదర్శి కే. నరేంద్ర, ప్రజానాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు, మండల కార్యదర్శివర్గ సభ్యులు అజ్మీర శోభన్‌బాబు, మండల కమిటీ సభ్యులు, చీమలపాడు శాఖ కార్యదర్శి యనమనగండ్ల రవిబాబు, రేలకాయలపల్లి శాఖ కార్యదర్శి రేమల్లె వీరస్వామి, రేలకాయలపల్లి చెరువు సంఘం అధ్యక్షులు ఎరిపోతు భద్రయ్య, పార్టీ సభ్యులు షేరు వెంకటేశ్వర్లు, ఎస్.కే. చిన్న సైదులు, రాచర్ల రణధీర్, కుమారుడు మాచర్ల రమేష్‌తో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## వైరా--ఇల్లందు యువతకు ఉపాధి బాటలు

**- కొత్తతండాలో మిషన్ వాక్ నైపుణ్య శిక్షణ కేంద్రం..**
**- ఆగస్టు 15న ప్రారంభానికి శ్రీకారం**

**సింగరేణి మండలం, ఆగస్టు 14 (భద్రాద్రి న్యూస్ రాములు):** వైరా, ఇల్లందు నియోజకవర్గాల పరిధిలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మిషన్ వాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సింగరేణి మండలం కొత్తతండా గ్రామంలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ బాదావత్ రవి తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. యువతలో ఉన్న ప్రతిభను గుర్తించి, వారి విద్యార్హతలు, ఆసక్తికి అనుగుణంగా ఉచితంగా శిక్షణ అందించడంతో పాటు శిక్షణ పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. మిషన్ వాక్ సంస్థతో పాటు ఇతర సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేలా అవసరమైన మార్గదర్శకత్వం, సహకారం అందిస్తామని వివరించారు.

**ఉచితంగా నైపుణ్య శిక్షణ**

నైపుణ్య శిక్షణ కేంద్రంలో వీల్‌చైర్ సహాయకులు, సంరక్షణ సహాయకులు, సహాయక సిబ్బంది, కార్యాలయ కార్యనిర్వాహకులు, స్వాగత సిబ్బంది, డిజిటల్ మార్కెటింగ్, వీడియో ఎడిటింగ్, ఫొటోగ్రఫీ--వీడియోగ్రఫీ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైనా, ఉత్తీర్ణులు కాకపోయినా యువత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి ఆసక్తి, ప్రతిభ ఆధారంగా శిక్షణ పొందే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వైరా, ఇల్లందు నియోజకవర్గాల పరిధిలోని యువతీ, యువకులు ఆగస్టు 15న కొత్తతండా గ్రామానికి వచ్చి తమ పేరు, విద్యార్హతలు, సంప్రదింపు వివరాలను నమోదు చేసుకోవాలని మిషన్ వాక్ ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు. "ఉద్యోగం కోసం ఎదురుచూడటం కాదు.. ఉద్యోగం పొందేలా నైపుణ్యాన్ని పెంచుకుందాం" అనే లక్ష్యంతో యువతకు శిక్షణ, శిక్షణకు ధ్రువపత్రం, ధ్రువపత్రం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే మిషన్ వాక్ ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం సంప్రదించాల్సిన ఫోన్: 93913 98016

మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బాదావత్ రవి ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమంపై యువతలో ఆసక్తి నెలకొంది.



## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో వ్యవసాయ రంగానికి పెను ముప్పు

**- అగ్రికల్చర్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఆరి బండి ప్రసాదరావు**
**- రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలి**
**- సిపిఐ (ఎం ) జిల్లా కార్యదర్శి అన్న నాగేశ్వరరావు**
**- సిపిఐ (ఎం ) వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం**

**వైరా, ఆగస్టు 14, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ మండల ముసలమడుగు గ్రామంలో శుక్రవారం "స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు – వ్యవసాయ రంగంపై ప్రభావం" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్కు ముఖ్య వక్తగా హాజరైన అగ్రికల్చర్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కారు బండి ప్రసాదరావు మాట్లాడుతూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో వ్యవసాయ రంగానికి పెనుముప్పు ఉందని, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని, ప్రపంచీకరణ, సరళీకరణ విధానాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు భారత వ్యవసాయ రంగంపై దీర్ఘకాలిక చెడు ప్రభావం చూ అవకాశం ఉందన్నారు. దేశీయ రైతుల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకోకుండా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులకు మార్గం సుగమం చేస్తే, తక్కువ ధరలకు విదేశీ ఉత్పత్తులు దేశీయ మార్కెట్లోకి ప్రవేశించే ప్రమాదం ఉందని, ఇప్పటికే పెరుగుతున్న సాగు ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, డీజిల్, విద్యుత్ ధరల భారంతో, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి పరిస్థితులలో విదేశీ వ్యవసాయ ఉత్పత్తులతో దేశీయ రైతులు పోటీ పడాల్సి వస్తే రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో వ్యవసాయం మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించాడు. రైతు పండించిన పంటకు ధర నిర్ణయించే హక్కు రైతుకు ఉండాలని, మార్కెట్లో రైతు రక్షణకు ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయాన్ని కేవలం మార్కెట్ సరిగ్గా చూడకుండా దేశ ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛా వాణిజ ఒప్పందలపై పారదర్శకమైన చర్చ జరగాలని, వాటి వల్ల ఏ పంటకు, ఏ ప్రాంతాల రైతులకు, ఏ విధమైన ప్రభావం ఉంటుందని విషయాలను ప్రజలకు ప్రభుత్వం స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు. దేశీయ రైతులకు రక్షణ కల్పించే విధానాలు రూపొందించకుండా అంతర్జాతీయ మార్కెట్ పోటీకి రైతులను వదిలేయటం సరికాదన్నారు. రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వ రక్షణ అవసరం అని అన్నారు. రైత్ర ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజా ఉద్యమాలను బలోపేది చేయాలి అని అన్నారు. ఈ సెమినార్ని ఉద్దేశించి సిపిఐ ఎం) జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రైతులకు కనీస మద్దతు ధర ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ చవకైన వ్యవసాయ రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతుల విషయంలో దేశీయ రైతుల ప్రయోజనాలను ప్రథమ ప్రాధాన్యంగా పరిగణించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలతో వ్యతిరేకంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రైతాంగ సమస్యలపై నిరంతర అధ్యయనం, ప్రజల్లో అవగాహన ఉద్యమ నిర్మాణం ద్వారానే ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు రాగలమని పేర్కొన్నారు. డివిజన కార్యదర్శి భూక్య వీరభద్ర మాట్లాడుతూ కామ్రేడ్ నర్వనేని సత్యనారాయణ జీవితాంతం ప్రజా సమస్యలపై అధ్యయనం చేస్తూ, తాను తెలుసుకున్న విషయాలను ప్రజా ఉద్యమాలకు అనుసంధానం చేసిన అధ్యయనశీలి ఆచరణ వాది అని కృషి చేశారు. ఆయన ఆలోచన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని నేటి సామాజిక, ఆర్థిక రాజకీయ, పరిణామాలపై అధ్యయనం చేసి ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత కమ్యూనిస్టు ఉద్యమంపై ఉందన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు కేవలం రైతుల సమస్యలు కాదని అవి దేశ ఆహార భద్రతకు, గ్రామీణ ప్రజల జీవనానికి, మొత్తం సమాజ ఆర్థిక వ్యవస్థకు సంబంధించినవి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ఆక్రమణదారులపై కఠిన చర్యలు ఎక్కడ..?

**- హెచ్చరిక బోర్డులతో సరిపోతుందా?**
**- హెచ్చరికలతో కాలయాపన ఎందుకు?..**
**- ఆక్రమణదారులపై వెంటనే కేసులు నమోదు చేయాలి**
**- అక్రమ కట్టడాలు పూర్తిగా తొలగించాలి**
**- ఏడాది నిర్లక్ష్యానికి తహసీల్దార్ హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలన్న డిమాండ్**

**చర్ల, ఆగస్టు 14: భద్రాద్రి న్యూస్ :** చర్ల మండలంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాల వ్యవహారం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వకపోయినా, అధికారులు మళ్లీ అదే చర్యను పునరావృతం చేయడం స్థానికుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సమయంలో కేవలం హెచ్చరిక బోర్డులతో సరిపెట్టడం ఎందుకనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

శుక్రవారం చర్ల తహసీల్దార్, ఎంపీడీవో, విద్యుత్ శాఖ ఏఈతో పాటు పలువురు శాఖల అధికారులు ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించి మరోసారి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే, ఇది సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని,



ఆక్రమణదారులకు పరోక్షంగా ఊరటనిచ్చే చర్యగా మారిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడం చట్టవిరుద్ధమైతే, ఆ చట్టాన్ని అమలు చేసే బాధ్యత అధికారులదే కాదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేవలం హెచ్చరికలు జారీ చేయడం కాకుండా, ప్రభుత్వ ఆస్తిని ఆక్రమించిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, చట్టవిరుద్ధంగా నిర్మించిన కట్టడాలను పూర్తిగా కూల్చివేయాలని డిమాండ్ చేస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానమే అయితే, ఆక్రమణదారుల విషయంలో ఎందుకు ఆలస్యం జరుగుతోందని ప్రశ్నిస్తున్నారు.

ఈ సమస్య ఏడాది కాలంగా కొనసాగుతున్నప్పటికీ, దాన్ని ప్రారంభ దశలోనే అరికట్టకుండా కాలయాపన చేయడం వల్లే ఆక్రమణదారులు మరింత ధైర్యం చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉద్దేశపూర్వక నిర్లక్ష్యంతో వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో తహసీల్దార్ హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ భూములను రక్షించడం రెవెన్యూ శాఖ ప్రాథమిక బాధ్యత అని గుర్తు చేస్తున్న ప్రజలు, ఇప్పటికైనా మాటలకే పరిమితం కాకుండా చట్టాన్ని కఠినంగా అమలు చేసి, ఆక్రమణదారులపై కేసులు నమోదు చేసి, అక్రమ కట్టడాలను పూర్తిగా తొలగించి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.